వాళ్ళ తుండేల క్రింద నరికిన ఆ బిడ్డణ్ణిచూసి అందరూ కన్నీరు కార్చారు.

* * *

పోలీసుస్టేషను లాకప్‌గది కిటికీవూచలు తొలిగించి పారిపోయి, యినస్పెక్టరు ఉద్యోగానికి ముప్పుదెచ్చినవాళ్ళు ఆ నలుగురూను. ఆ దొంగల్ని పట్టియిచ్చినందుకు మాణిక్యంమీద ఆ యినస్పెక్టరుకి కలిగిన పూజ్యభావానికి పరిమితి లేదు.

మాణిక్యం చెప్పిన కథంతా విని, అర్థంచేసుకుని సుబ్బన్నను పిలిపించి కాపురం సరిగ్గా చేసుకోలేకపోతే అరెస్టు చేస్తానని బెదిరించి, సూరయ్యని పిలిపించి, నీ కూతుర్ని కట్టుబాటులో ఉంచకపోతే డొక్క చీలుస్తానని కోపపడి, ఆ దంపతులిద్దరినీ కలిపాడు యినస్పెక్టరు.

మళ్లా పదినెలలకి మాణిక్యం మగపిల్లవాణ్ణి కన్నది. మొదటి కొడుకును బలి యిస్తేనే కాని రెండో కొడుకు పుట్టాడుకాదు, పాపం!

---

# 19. తక్కిన ఇద్దరు

నరసింహారావు ఆ ఆఫీసులో చేరి రెండు సంవత్సరా లయింది. అతి కష్టం మీద ఆ ఉద్యోగం సంపాదించాడు. ఎన్నో ఆఫీసులు తిరిగి, ఎంతోమందిని దర్శించి, నానా అవస్థలూ పడితేగాని ఆ ఉద్యోగం దొరకలేదు. బి.ఏ. ప్యాసయినా, తనకన్న తక్కువ చదువుకున్నవాళ్లు ఎక్కువ జీతం సంపాదించుకుంటూ ఉన్నా, చాలా కాలం ఉద్యోగం లేకుండా అవసపడి ఉండటంచేత, ఏదో ఒక ఉద్యోగంలో, ఎంతోకొంత జీతంమీద చేరితేనే కాని లాభం లేదనీ, ఒకసారి ఎక్కడో ఒకచోట చేరితే, తరవాత క్రమంగా పైకి పోవచ్చుననీ, అతడు ముప్ఫయి రూపాయిల జీతానికే—పాపం, ఆ ఉద్యోగంలో చేరాడు.

ఆ ఆఫీసులో అతడు చేరేటప్పటికి, అంతకు పూర్వమే అయిదుగురు గుమాస్తాలు ఉన్నారు. నరసింహారావు ఆరోవాడు. ఇతను చేరిన తరువాత, ఈ రెండేళ్ళలోనూ ఇద్దరు గుమాస్తాలు అక్కడ పని మానుకొని, ఎక్కువ జీతాలమీద ఇంకెక్కడో చేరారు. ఆ ఇద్దరూ పని మానుకున్నప్పుడు నరసింహారావు, తన యజమాని దగ్గరకు వెళ్ళి, తనకు కొద్దిగానైనా జీతం ఎక్కువ చెయ్యమని అర్థించాడు. కాని, ఆ కొరకరాని కొయ్య యజమాని దగ్గర అదేమీ పని చెయ్యలేదు. నరసింహారావు చేస్తున్న పనికి తాను ఇచ్చే జీతమే చాలా ఎక్కువన్నట్లు మాట్లాడాడు ఆ యజమాని. నరసింహారావు మాత్రం ఈ అభిప్రాయంతో ఎంతమాత్రమూ ఏకీభవించక పోయినా- ప్రస్తుతం ఆ ఉద్యోగం వదిలిపెట్టివేస్తే, తాను చేతిలో ఉద్యోగం ఏమీలేక అవస్థ పడవలసి వస్తుందని, కిక్కురుమనకుండా పూరుకున్నాడు.

బియ్యం ధర పెరిగింది. నెయ్యి ధర హెచ్చింది. గుడ్డల ఖరీదు ఒకటికి నాలుగు రెట్లయింది. ఇంటి యజమాని ఇంకొక నాలుగు రూపాయలు ఎక్కువ ఇస్తే సరి, లేకపోతే ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడు. నరసింహారావు జీతం మాత్రం ఎదుగూ, బొదుగూ లేకుండా అలాగే ఉంది. పగలు ఆఫీసులో పనిజేస్తూవున్నంతసేపూ, చాలా తక్కువ జీతానికి విపరీతంగా ఎక్కువ చాకిరీ చేస్తున్నానే అనే రోషంతోనూ, ఇంట్లోవున్న కాస్సేపూ, ఇంటిఖర్చుకు సరిపోయే మాత్రమేనా సంపాదించలేక పోతున్నానే అనే బెంగతోనూ నరసింహారావు తపనపడి పోతున్నాడు.

నరసింహారావు భార్య చాలా మర్యాద తెలిసిన మనిషి కనక, తన చేతనైనంతవరకు మగని మనస్సుకు కష్టం కలిగించకుండావే సంసారం గడపడానికి ప్రయత్నిస్తోంది. కాని అది ఒక మాత్రాన సాధ్యమా—యాభై రూపాయల ఖర్చు యాభై రూపాయలే, ముప్పయి రూపాయిల సంపాదన ముప్ఫయి రూపాయలే.

ఈసారి ఎలాగయినా సరే—యజమానితో మాట్లాడి జీతం ఎక్కువ చేయించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

యజమాని దగ్గరకు వెళ్లాడు. కొంచెంసేపు నిలుచున్నాక,

"ఏమిటి?" అని అడిగాడు యజమాని.

కొంచెం తడబడి మెల్లిగా గొంతు సవరించుకొని "వస్తువుల ఖరీదులన్నీ చాలా పెరిగిపోయాయండి" అన్నాడు.

ఆ యజమాని దేవాంతకుడు. నరసింహారావు ఏమి అడగ దలచుకున్నాడో గ్రహించి, ముందరి కాళ్ళకి బంధంగా "అవును. చాలా పెరిగిపోయాయి. ఆఫీసు ఖర్చులు కొంత తగ్గించుకోవాలని ఆలోచిస్తున్నాను. ఏమీ పాలుపోవటం లేదు" అన్నాడు.

నరసింహారావుకి గొంతులో ఏదో అడ్డంపడినట్లయింది.... కాని గొంతు సవరించుకొని, మరి కొంచెం ధైర్యం తెచ్చుకొని, "నాకు జీతం బొత్తిగా చాలటం లేదండి. ఇంక్రిమెంటు ఏమైనా ఇస్తేనేగాని, బొత్తిగా గడిచేటట్టు లేదు. మీ ఆఫీసులో చేరి రెండేండ్లయింది. పైగా, నేను చాలా కష్టపడుతున్నాను కూడాను. ముగ్గురు మనుష్యుల పనిచేస్తున్నాను, నేను ఒకణ్ణే" అని అన్నాడు.

నరసింహారావు మొహం చూస్తూ యజమాని "నరసింహారావు, ఆఫీసు ఖర్చు చాలా ఎక్కువ అయిందని ఇప్పుడే కదా నీకు చెప్పాను. నువ్వు ఒక్కడివీ ముగ్గురు గుమాస్తాలపని చేస్తున్నానంటున్నావ్. ఆ తక్కిన ఇద్దరూ ఎవరో చెప్పు — వాళ్ళని తీసి పారేస్తాను. ఆఫీసు ఖర్చు కొంతేనా తగ్గుతుంది" అన్నాడు.

నరసింహారావు నోట మాటలేక అలాగే నిలుచున్నాడు.

---

# 20. రమణి రాసిన ఉత్తరం

"రామారావ్! రేపు ఆదివారం; ఎల్లుండి గాంధిజీ జన్మదినం; ఆ మర్నాడు మహాలయ అమావాస్య. మూడు రోజులు బ్యాంకికి సెలవు. ఇవ్వాళ శనివారం పన్నెండు గంటలకే బ్యాంకి మూసేస్తారు